


# కొత్త మనిషి

కాలేజీలో చదువుకునే రోజుల్లో తన సహవిద్యార్థులందరి కంటే అందగాడూ, తెలివైనవాడూ, మెత్తని వాడూ అయిన అభిరాం మీద ఇష్టాన్ని పెంచుకున్న అరడజను మంది విద్యార్థినుల్లో మనోరమ కూడా ఒకర్తె.

యువతుల స్నేహం కోసం యువకులు వెంపర్లాడటం లోకసహజం. కానీ అందుకు భిన్నంగా ఆరుగురమ్మాయిలు ఏదో విధంగా అతడి దృష్టిని ఆకర్షించాలని తాపత్రయపడే వారంటే అందుకు కారణం... యువతుల దృష్టిలో మిగిలిన వారి నుంచి అతడిని వేరు చేసే సుగుణాలే.

తమను పెంచి పెద్ద చేసి చదువు చెప్పించి, తమ ఆర్థిక తాహతుకు అందుబాటులో ఉన్న కుర్రాణ్ని తెచ్చి తమకు కట్టబెట్టడం తమను కన్నవాళ్ల బాధ్యతే అని మనసారా నమ్మే సగటు ఆలోచనలు గల ఎందరో ఆడపిల్లల కోవలోకే ఈ ఆరుగురమ్మాయిలూ వస్తారు నిస్సందేహంగా.

ఏ వరుడిలోనైనా తల్లిదండ్రులు ప్రధానంగా చూసే గుణాలు వరుసగా... చెడు అలవాట్లు లేకపోవడం, నలుగురిలో ఆక్షేపణీయం కాని చదువూ, నిలకడైన సంపాదననిచ్చే ఉద్యోగం లేదా వ్యాపారం, బోనస్‌గా స్థిరాస్తులూ, ఆ తరువాతే అందచందాలూ, సర్దుకుపోయే గుణం ఇత్యాదులని ఎక్కువమంది ఒప్పుకునే వాస్తవం.

సాధ్యమైనంత వరకూ తమ కోసం వెదికే వరుడులో ఈ లక్షణాలు చూసే తమ తల్లిదండ్రులు కూడా తమకు వరుణ్ని ఎంపిక చేస్తారని పెళ్లి కాబోయే ప్రతి ఆడపిల్లకూ తెలిసినట్టే మనోరమకూ ఆమె స్నేహితురాళ్లకూ తెలుసు.

కానీ పై లక్షణాలన్నీ కలిగి ఉండడంతోపాటు తనకిష్టం ఉన్నా లేకపోయినా ఎదుటివారి ఇష్టాన్ని మన్నించే గంగిగోవులాంటి అభిరాం అనే వ్యక్తి దొరకడం అరుదైన విషయం కాబట్టే వారతణ్ని అంతగా ఆరాధించి అతడి దృష్టి తమ మీద పడేలా చేసుకుందుకు తమ ప్రయత్నాలు తాము చేసేవారు.

అయితే అందరిలోకీ పట్టుదలగా ప్రయత్నించి అభిరాంను తన పట్టులో బిగించడంలో కృతకృత్యురాలైంది మాత్రం మనోరమే!

మిగిలిన వారందరూ తమకిష్టమైనవే అతడికీ ఇష్టం అయ్యేలా జేయాలని తాపత్రయపడితే మనోరమ తెలివిగా తనకంటూ ప్రత్యేకంగా ఇష్టాలు లేవనీ అతడి ఇష్టాఇష్టాలే తనవీ అనీ అతణ్ని నమ్మించి.. ఆ తర్వాత నుంచీ తన ఇష్టాల్నే అతడి ఇష్టాలుగా అతడు భావించే మేరకు అతణ్ని సన్నద్ధం చేసి తన కనుసన్నల్లో మెలిగేలా చేసుకుంది.

ఆ తర్వాత వీలు చూసుకుని చాకచక్యంగా తన వైపు పావులతోపాటు అతడి వైపు పావులను కూడా తనే కదిపి తాళితో అతడు తనను బంధించేలా చేసుకుని తాను కట్టుకున్న ప్రేమ కోటలో శాశ్వతంగా అతణ్ని బందీని చేసింది.

శోభనం గదిలో డిమ్‌లైట్ వేసి ఉంచాలా, ట్యూబ్‌లైట్ వెయ్యాలా అనే విషయంతో మొదలుపెట్టి చీరలూ, సినిమాలూ, ఇంటి అలంకరణా, పుస్తకాలూ, విహారయాత్రలూ... ఇలా అనేకానేక విషయాల్లో తన మాటే అతడు వేదంలా భావించే స్థితికి తీసుకొచ్చిందతణ్ని.

అతడికి ఇంగ్లీషు సినిమాలంటే ఇష్టం. ఆమెకు మొగుడి మీద పెళ్లాం ఆధిపత్యాన్ని రసభరితంగా చూపించే సన్నివేశాలున్న ఏ సినిమా అయినా భాషతో నిమిత్తం లేకుండా అత్యంత ప్రీతిపాత్రం.

అతడికి అప్పుడప్పుడూ బీచ్‌కు వెళ్లడం ఇష్టం. ఆమెకు వారానికోసారి బజారుకు వెళ్లి చీరలు బేరం చేయడం ఇష్టం. రాత్రి తొమ్మిది గంటలకు నిద్రపోవడం అతడికిష్టం. గోడ గడియారం పదకొండు గంటలు కొట్టకముందు ఆమెకు ఎట్టి పరిస్థితుల్లోనూ నిద్ర రాదు.

అతడికి తీపి అంటే ఇష్టం. ఆమెకు కారం అంటే ఇష్టం. అతడికి శాకాహారం ప్రియమైతే ఆమెకు మాంసాహారం అంటే ప్రాణం. పగలూ, రాత్రీ అనే భేదం లేకుండా ఇంట్లో ఉన్న అన్ని గదుల్లోనూ ఆడవాళ్లు నైటీల్లో తిరుగుతూ కనిపిస్తే అతడికి కంపరం. ఇంట్లో ఉన్న సమయంలో ఎక్కువసేపు నైటీ తప్ప మరో వస్త్రాన్ని ధరించడం ఆమెకిష్టం ఉండదు.

పాత బట్టలు బీదవాళ్లకు దానం చేయమని అతడంటే వాటిని కూడా డబ్బు రూపంలోకి మార్చి ఇంటికి అవసరం లేని వస్తువులు పోగు చేయడంలో ఎంతో మానసిక తృప్తిననుభవిస్తుందామె.

ఆఫీసు విషయాలు ఇంట్లో చర్చించడం అతడికిష్టముండదు. అతడి ఉద్యోగానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవడం ఆమెకు హాబీ. 'పనివాళ్ల పట్ల అభిమానం చూపించాల'ని అతడంటే 'మనం అభిమానం చూపించినంత మాత్రాన తక్కువ జీతానికి వాళ్లు పని చేస్తారా?' అని వాదన లేవదీస్తుందామె.


రోజులు గడిచే కొలదీ.. ఆమెతో విభేదించటం వల్ల మనస్తాపం తప్ప మరేమీ లభించదనే ఇంగితంతో ఇష్టమున్నా లేకపోయినా ఆమె ఇష్ట ప్రకారమే జరగనిస్తూ వచ్చాడు అభిరాం.

పోరాడకుండా లభించిన విజయం ఆమెకూ ఆనందాన్నివ్వడం మానేసింది క్రమేణా. దాంతో కొత్త బాణీ అందుకుంది. 'పెళ్లికాక ముందే నయం! మీకంటూ స్వంత అభిప్రాయాలుండేవి. నేనొప్పుకున్నా, ఒప్పుకోకపోయినా చివరికి నా దారిలోకే వచ్చినా కనీసం మీ ఇష్టాలేవిటో చెప్పేవారు' అని రోజూ కనీసం ఏడెనిమిది సార్లు అతణ్ని రెచ్చగొట్టకపోతే ఆమెకు మనశ్శాంతి లభించేది కాదు.

తనెంత కవ్వించినా ఆశించిన స్పందన అతడి నుంచి రాకపోవడంతో తను విసిరిన ప్రతి బంతికీ ఓ వికెట్ పడిపోతే బౌలర్‌కు ఆనందం స్థానే నైరాశ్యం ఎలా కలుగుతుందో తెలిసి వచ్చిందామెకు. దాంతో ప్రతి విషయంలోనూ కోరిక కయ్యానికి కాలుదువ్వడం ద్వారా కొంచెం ఉపశమనం లభించేదామెకు.

ఇంట్లో పరిస్థితి ఇలా ఉంటే అతడు ఉద్యోగం చేసే చోట కూడా పరిస్థితి భిన్నంగా లేకపోవడం అతడికి తీవ్ర అసంతృప్తిని కలిగించేది.

వరాహనరసింహ నామ ధేయుడైన అతడి బాస్ చిన్నప్పుడెలా ఉండేవాడో కానీ నలభై ఏళ్ల వయసొచ్చే



సరికి తన పేరులో ఉన్న రెండు జంతువుల్నీ మనిషి ఆకారంలో మలిస్తే ఏ రూపం సంతరించుకుంటుందో అలా రూపాంతరం చెంది సార్థకనామధేయుడనే పదప్రయోగానికి నిలువెత్తు నిదర్శనంలా భాసిస్తూ ఉంటాడు.

సింహాన్ని అందరూ మృగరాజని గొప్పగా పొగుడుతారు. కానీ క్రూరజంతువులన్నిటిలోకీ బద్ధకంగా సంచరించే జంతువు సింహమేననేది చాలా కొద్ది మందికి తెలిసిన విషయం.

ఆ విషయం తెలియని వారికెవరికైనా వరాహనరసింహం పనితీరును పరిశీలిస్తే సింహం దినచర్య పట్ల అనుమానం వచ్చి తీరుతుంది.

బాస్ అనే వాడు కేవలం తన సంతకానికి నిర్దేశించబడిన చోట సంతకాలు పెట్టడమే కాకుండా ఆ సంతకానికి నిర్దేశించబడిన స్థలానికి పైన పొందుపరచిన విషయాల పట్ల అవగాహన కూడా కలిగి ఉండాలనే విషయాన్ని అలా సందర్భాల్లో వరాహనరసింహం విస్మరిస్తూ ఉంటాడు.

కానీ తన ముందుంచబడిన కాగితాల్లోని లోపాలన్ని అనవరతమూ తాను గమనిస్తూ ఉంటాడనే భావన క్రింది వాళ్లకు కలగాలన్నట్టుగా అప్పుడప్పుడూ వాటిలో లోపాలు కానీ లోపాల్ని ఎత్తి చూపుతూ ఉంటాడు.

ఉదాహరణకు.. రెండో పేరాలో నాలుగో పదానికీ, అయిదో పదానికీ మధ్య ఎక్కువ ఖాళీ వచ్చిందనో, ఆరో పేరాలో నాలుగో వాక్యంలో కామా అవసరం లేకపోయినా టైప్ చేశారనో, స్టేట్‌మెంట్స్‌లో కొన్ని అంకెలు స్పష్టంగా కనబడటంలేదనో... అటువంటి సూక్ష్మలోపాల్ని ఎన్నో రెట్లు పెద్దవి చేసి క్రింది ఉద్యోగుల బాధ్యతా రాహిత్యాన్నీ, అలసత్వాన్నీ, నిర్లక్ష్య ధోరణినీ అప్పుడప్పుడూ నిర్దాక్షిణ్యంగా ఎండగడుతూ వాళ్లు తన ముందుంచిన ప్రతి కాగితాన్నీ గుడ్డిగా సంతకం చేసే అంధుణ్ని కాననీ అందరికీ రెండు కళ్లుంటే తనకు మూడు కళ్లున్నాయనీ కనుక తన దగ్గర పనిచేసే వాళ్లు ఒళ్లు దగ్గర ఉంచుకుని పనిచేయాలనీ, లేకపోతే తను మూడో కన్ను తెరవాల్సి వస్తుందనీ గర్జిస్తూ ఉంటాడు.

చదువు పూర్తయ్యాక ఎంతో ఉత్సాహంతో, మరెన్నో ఆశయాలతో ఉద్యోగంలో చేరిన అభిరాంకు తను చదివిన చదువు ప్రయోజనం ఈ ఉద్యోగం సంపాదించడం వరకే పరిమితమనీ, వృత్తిలో పైకెదగడానికి తెలివితేటలను మించి వేరే ఏదో లక్షణం కూడా ఉండి తీరాలనీ అనతికాలంలోనే అర్థమైంది.

అనుభవజ్ఞుల సలహా మేరకు ఏటికి ఎదురీదడంతో పోలిస్తే ప్రవాహం వాలుకనుగుణంగా దిశను మార్చుకోవడంలో ఉన్న సుఖం ఏవిటనేది అతడికర్థమైంది క్రమేణా.

ఇంటా బయటా రాజీపడిపోయి జీవించడంలో సుఖం ఉన్నా, కొంతకాలానికి ఆ సుఖం కూడా అతడి మనసుకు తృప్తినీయడం మానేసింది. ఆ అసంతృప్తి అతడి మనసులో అంతులేని సంఘర్షణ చెలరేగడానికి బీజం వేసింది.

ఆ బీజం మొలకెత్తి దినదిన ప్రవర్ధమానమవుతుం

దడంతో తట్టుకోలేక అతడి మనసు వేరే కోణంలో ఆలోచించడం ప్రారంభించింది.

ఈ నేపథ్యంలో ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టి గమ్యం లేకుండా ఊరంతా తిరిగి సాయంత్రమయ్యేసరికి బీచ్‌కు చేరుకున్నాడు అభిరాం. ఎదురుగా ఉవ్వెత్తున ఎగసిపడుతోన్న కెరటాల్ని నిర్నిమేషంగా చూస్తూ తన అంతరంగపులోతుల్ని స్పృశించే ప్రయత్నంలో పడిపోయాడతడు.

మనోరమ అడుగులకు మడుగులొత్తుతూ తను జీవించకపోతే ఏమవుతుంది? కొన్నాళ్లు ఇల్లు రణరంగం కావచ్చు. తను మారే వరకూ తిరిగి రానని మనోరమ పుట్టింటికెళ్లవచ్చు. కానీ ఎంత కాలం అక్కడే ఉండిపోతుందామె?

రోజులా? వారాలా? సంవత్సరాలా?.. ఆమెతో జీవితం తనకే గానీ తనతో జీవితం మనోరమ కవసరం లేదా? తనతో జీవితం ఆమెకవసరం లేనప్పుడు తనకూ ఆమెతో జీవించాల్సిన అవసరం లేదనే నిర్ణయం తను గట్టిగా తీసుకుంటే తాను ప్రతి విషయానికీ తలూపే బభ్రాజమానం గాడే కాదనీ, తనకూ ఓ వ్యక్తిత్వం ఉందనీ, దానికి భిన్నంగా ప్రవర్తిస్తే తను సహించడనీ ఆమెకు తెలిసొస్తుంది.


అలా జరగని పక్షంలో నిత్యమూ వ్యక్తిత్వాన్ని చంపుకుని బ్రతికే కంటే తన సహజ వ్యక్తిత్వానికి అనుగుణంగా బ్రతకడం వల్ల సంఘర్షణ ఉన్నప్పటికీ ఎంతో తృప్తీ, ఆనందమూ తప్పకుండా ఉంటాయి.

తన బాస్ వరాహంగాడు మాత్రం తను ఎదురు తిరిగితే ఏం చేస్తాడు? తనను బదిలీ చేయించొచ్చు లేదా తన పని సంతృప్తికరంగా లేదని యాజమాన్యానికి రిపోర్ట్ పంపొచ్చు. కానీ తనను ఉద్యోగం నుంచి తీయించే పని మాత్రం చేయలేడు.

ఎందుకంటే ఆ రిపోర్టులోని విషయాలు నిజమని నిరూపించగలగాలి. అతడికంత సత్తాగానీ, బుర్ర గానీ లేవని తనకు బాగా తెలుసు. మరెందుకు తనతడికి భయపడుతున్నాడు?

తన వ్యక్తిత్వాన్ని చంపుకోకుండా తను తనలా ప్రవర్తిస్తే తద్వారా ఉద్యోగంలో సంభవించగల ఒడిదుడుకుల్ని ఎదుర్కొనే సామర్థ్యం తనకు నిజంగా లేదా?

ఎదుటివారి ఇష్టాయిష్టాల్ని తనకిష్టం లేకపోయినా గౌరవిస్తున్నానని భ్రమపడుతూ ఆత్మవంచనతో వ్యక్తిత్వాన్ని చంపుకుని ఎంత కాలం నిరాసక్తంగా, ప్రాణం లేని బొమ్మలా జీవితాన్ని గడపదలుచుకున్నాడు తను? ఒకసారి ఆ ఆలోచన వచ్చాక అది పెరిగి పెద్దదై అతడి మెదడును పూర్తిగా ఆక్రమించుకుని కర్తవ్యాన్ని ఉపదేశించిందతడికి.



తనేం చేయాలోననే విషయం మీద స్పష్టమైన అవగాహన వచ్చేసరికి అతడిలో ఏదో ఉత్సాహం వెల్లివిరిసింది. కూర్చున్న చోటు నుంచి లేచి గాలిలో తేలిపోతున్నట్టుగా పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ఇంటిముఖం పట్టాడు అభిరాం.

★★★

"రమా.. రమా.." అంటూ ఇంట్లోకి అడుగు పెట్టిన అభిరాంను ఆశ్చర్యంగా చూసి అంతలోనే కోపంగా "నాకలా పిలిస్తే ఇష్టం ఉండదని తెలుసుగా! నాకిష్టమైనట్టు నిన్నటి వరకూ 'మనూ' అని పిలిచిన మీకేమైందీ రోజు?" అంది మనోరమ.

ఆమె ఆరోపణను పట్టించుకోకుండా "ఈ క్షణం నుంచీ నేనలానే పిలుస్తాను. నా పిలుపుకు స్పందించడం, స్పందించకపోవడం నీ ఇష్టం. నాకలా పిలవడమే ఇష్టం!" అన్నాడు అభిరాం ప్రతిపదాన్నీ స్పష్టంగా ఉచ్ఛరిస్తూ.

తన చెవుల్ని తాను నమ్మలేకపోయింది మనోరమ. భోజనానికి కూర్చున్నప్పుడు ఆమె ఆశ్చర్యం రెట్టింపైంది.

"నాకే కూరలంటే ఇష్టమో నీకు తెల్సని నాకు తెలుసు. నీకిష్టమైన వంటకాలు నీకు నచ్చిన విధంగా వండుకో. నాకభ్యంతరం లేదు. రేపట్నుంచీ నాకు ఇష్టం లేని కూరలు మాత్రం వండకు. ఆ పని నీ వల్ల కాకపోతే చెప్పు. నా ఏర్పాట్లు నేను చేసుకుంటాను.

ఈ రోజు నుంచీ రాత్రి తొమ్మిది గంటలు దాటాక పడక గదిలో లైటు వేసుకుని నువ్వు అర్ధరాత్రి వరకూ చదువుకుంటూ కాలక్షేపం చేయడం కుదరదు. అంత రాత్రి వరకూ నీకు నిద్ర రాకపోతే హాలులో కూర్చుని చదువుకో. లేదా నీ పడకను హాలులోకి మార్చుకో!" అని చేయి కడుక్కుని లేచి వెళ్లిపోతున్న అభిరాంను నివ్వెరపోయి చూసింది మనోరమ.

మర్నాడు టిఫిన్ చేసి ఆఫీసుకు వెళుతూ "నీ పాత బట్టల్ని ఏం చేసుకుంటావో నీ ఇష్టం. నా పాత బట్టల్ని మాత్రం అమ్మే ప్రయత్నం చేయకు.

వాటినేం చేయాలో నేను నిర్ణయిస్తాను. నీకిష్టమైన సినిమాలు చూడాలంటే నువ్వు వెళ్లి చూడు. టిక్కెట్లు ముందుగా తెప్పించి నన్ను కూడా నీతో రమ్మని బలవంతపెట్టకు!" అని నోరెళ్లబెట్టి చూస్తోన్న మనోరమను పట్టించుకోకుండా బయటకు వెళ్లిపోయాడు అభిరాం.

★★★

## ఉద్దేశమేంటో?

అమృతారావు ఈమధ్య ఓ ఫంక్షన్‌లో పాల్గొన్నప్పుడు మాట్లాడుతూ- 'బాలీవుడ్‌లో తనదైన ఫ్యాషన్ స్టయిల్ ఎవరికైనా వుందీ అంటే అది సుస్మితాసేన్ స్టయిలే. ఆమెను నేను స్కూల్లో చదువుకున్నప్పటి నుంచీ ఎంతో ఆరాధించేదాన్ని. ఇప్పుడు కూడా గ్లామర్ విషయంలో ఆమెనే ఫాలో అవుతున్నాను' అంటూ సెలవిచ్చింది. బాగానే వుంది- తను స్కూల్లో చదివే రోజుల్లోనే సుస్మి తను ఆదర్శంగా తీసుకున్నానని చెప్పడంలో అర్థం ఏంటో? అంటే సుస్మిత తనకంటే మరీ పెద్దామె అనా? లేక తను మరీ చిన్నపిల్లని అనా? ఆమె ఉద్దేశం అని సినీజనాలు చెవులు కొరుక్కుంటున్నారు.

తన సీట్లో కూర్చుని పనిచేసుకుంటోండగా వరాహం నుంచి రమ్మని కబురొచ్చిన పది నిముషాలకు అతడి గదిలోకి వెళ్లి "యస్సర్..!" అన్నాడు అభిరాం.

అతడి వైపు తీక్షణంగా చూస్తూ "నిన్ను రమ్మని కబురుపెట్టిన పది నిముషాల తర్వాత తీరిగ్గా నా దగ్గరకు రావడానికి నీకెన్ని గుండెలు?" అన్నాడు వరాహ నరసింహం.

"మీలానే నాకూ ఒకే గుండె ఉంది సార్! చేస్తోన్న పనిని మధ్యలో వదిలేసి వస్తే మళ్లీ తిరిగి పని మొదలుపెట్టడానికి పది నిముషాల కంటే ఎక్కువ సమయమే వ్యర్థం అవుతుంది కనుక ఆ పని పూర్తి చేశాకనే వచ్చాను" అన్నాడు అభిరాం ఏమాత్రమూ తడబాటు లేకుండా.

కళ్లు పెద్దవి చేసి హుంకరిస్తూ అన్నాడు వరాహ నరసింహం. "ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?"

"తప్పకుండా. మీ పేరు మీరింకా మార్చుకుని ఉండకపోతే శ్రీ వరాహనరసింహంగారనే నా బాస్‌తో మాట్లాడ్తున్నానని అనుకుంటున్నాను. కరెక్టే కదా సార్?" అన్నాడు అభిరాం.

తన మీదకు బాణం సంధించిన వేటగాడి మీదకు ఉరకబోయే ముందు భీకరంగా గర్జించే సింహాన్ని తలపింప చేశాడు వరాహనరసింహం ఆ క్షణంలో.

"ఎంత కండకావరం నీకూ? నన్నే పేరు పెట్టి పిలుస్తావా?" అంటూ రౌద్రాన్ని అభినయించాడు.

"నేను మిమ్మల్ని పేరు పెట్టి సంబోధించలేదు సార్! మీరడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పానంతే!" అన్నాడు అభిరాం ఏమాత్రమూ తొణక్కుండా.

తను కూర్చున్న రివాల్వింగ్ ఛెయిర్‌కున్న స్ప్రింగు విరిగిపోతుందేమోనన్నంతలా ముందుకూ, వెనక్కీ ఊగిపోతూ "నేను తల్చుకుంటే నిన్నేం చేయగలనో తెల్సా?" అని ఆవేశంగా అరిచాడు వరాహ నరసింహం.

పూర్తిగా కాకపోయినా కొంతవరకూ ఊహించగలను సర్.. నా బదిలీకి సిఫారసు చేయవచ్చు. నా పని తీరు సంతృప్తికరంగా లేదని యాజమాన్యానికి రిపోర్టు పంపించే అవకాశం కూడా లేకపోలేదనుకుంటున్నాను" అన్నాడు అభిరాం కంఠంలో వినయాన్ని ధ్వనింపజేస్తూ.

ఈసారి వరాహనరసింహం మొహంలోని ఆగ్రహాన్ని, ఆశ్చర్యం దాచిపెట్టింది.

"అయినా నీకు భయం లేదా?!" అన్నాడు స్వరం తగ్గించి.

"భయమెందుకు? నేనేవైనా తప్పు చేస్తే కదా! నా మీద రిపోర్టు ఇచ్చినంత మాత్రాన దాన్ని యథాతథంగా యాజమాన్యం నమ్మాలని ఏం ఉంది? నా పని తీరు సంతృప్తికరంగా ఉందో లేదోననడానికి ఋజువు నేను చేసినా, చేస్తోన్న పనే అయిన పక్షంలో మీ రిపోర్టు అందుకు విరుద్ధంగా ఉన్నప్పటికీ మీరాశించిన ప్రయోజనం నెరవేరదు కదా!" అన్నాడు అభిరాం అదే వినయంతో.

వరాహనరసింహంకు విషయం అర్థం కావడమే కాకుండా బుర్ర చురుగ్గా పనిచేసింది.

"సరే..సరే.. ఈసారికి నీ మీద ఏ చర్యా తీసుకోకుండా వదలిపెడుతున్నాను. ఇహ ముందు పిలిచిన వెంటనే రావడం అలవాటు చేసుకో" అన్నాడు.

"అది మీరు ఏ సమయంలో పిలుస్తారనే దాని మీద ఆధారపడి ఉంటుంది సర్! నాకు అప్పజెప్పిన పనిని పూర్తి చేయడం మౌలికంగా నాకు ముఖ్యం. నా పనిలో చిన్న చిన్న లోపాలేవైనా దొర్లితే వాటిని తప్పకుండా సవరించుకుంటాను ముఖ్యమైన పనులు ముందుగా పూర్తి చేసిన తర్వాత. నా ఉద్దేశ్యం మీకు అర్థమైందనుకుంటాను" అని తన సీటు దగ్గరకు వచ్చేశాడు అభిరాం. 'ఈ రోజు నుంచైనా క్రింది ఉద్యోగుల పట్ల అతడి ప్రవర్తనలో మార్పొస్తే అతడి అదృష్టం! లేకపోతే అతడి కర్మ' అనుకుంటూ.

'గుర్'మనబోయి తన కుర్చీలో అచేతనంగా ఉండిపోయాడు వరాహ నరసింహం చాలాసేపు.

ఆఫీసు నుంచి ఇంటికి తిరిగొస్తూ అనుకున్నాడు అభిరాం. ఈ లోకంలో ఇద్దరు మనుషుల్ని కలిపి ఉంచే శక్తులు రెండే రెండు. ఒకటి భయం, రెండు అవసరం.

తనతో అవసరం ఉన్నా భవిష్యత్తు మీద తనకు భయాన్ని కలగజేసి ఇంత కాలమూ తనతో ఆడుకున్నారు మనోరమా, వరాహనరసింహమూ కూడా.

ఈ విషయం తనకు ఆలస్యంగా తట్టడం శోచనీయమే అయినా తనను దూరం చేసుకుంటే వారి ఉనికికే భంగం కలుగుతుందనే భయాన్ని తనిప్పుడు వారిలో కలగజేశాడు కనుక వాళ్లిద్దరూ తన దారికి వచ్చినా రాకపోయినా తన దారికి అడ్డు మాత్రం రారు ఇహ ముందు.

○



## కరీనా సంబరం

**నాకు పసిపిల్లలంటే ఎంత ఇష్టమో అంటూ తెగ ఇదిగా చెబుతుంది కరీనాకపూర్. ఇటీవలే కరీనా అక్క కరిష్మాకపూర్ మగబిడ్డకి జన్మనిచ్చింది. అంతే కరీనా తన షూటింగ్‌లన్నీ వాయిదా వేసుకుని మరీ ఇంట్లో ఆ పసిబిడ్డని చూస్తూ గడిపేస్తోందిట. రెండోసారి తను పిన్నిగా మారినందుకు సంతోషాన్ని పట్టలేకపోతున్నాను అని చెబుతున్న కరీనా-అక్క కొడుక్కి కావలసిన వస్తువులు, బోల్డన్ని బొమ్మలు గట్రా కొనేసిందిట. అక్క పిల్లల్ని చూసి మురిసిపోవడమేనా? తన పెళ్లి, తన పిల్లల సంగతి ఏమైనా ఆలోచిస్తోందా?**